క్లుప్తంగా

గూడెంలో ముగిసిన పవిత్రోత్సవాలు


మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

దండేపల్లి: జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన దండేపల్లి మండలంలోని గూడెం శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా మూడు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు సోమవారం ముగిశాయి. చివరిరోజు మహాపూర్ణాహుతి, పవిత్ర అవరోహణము, స్నపన తిరుమంజనము, కుంభ ప్రోక్షణ, హారతి, మంత్ర పుష్పం, మహాదాశీర్వచనం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో వేదపండితులు భరత్‌శర్మ, ప్రధాన అర్చకులు రఘుస్వామి, సంపత్‌స్వామి, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

శివాలయానికి పోటెత్తిన భక్తజనం


శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

చెన్నూర్: స్థానిక శివాలయంలో భక్తజనం పోటెత్తారు. శ్రావణమాసంలో నాల్గో సోమవారం కావడంతో తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయంలో భక్తి శ్రద్ధలతో శివయ్య దర్శనం చేసుకొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు వేమారం మహేశ్వర్‌శర్మ, జక్కెపల్లి హిమకర్‌శర్మ, గురుచరణ్‌శర్మ పాల్గొన్నారు.

ఎస్సైకి ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న చైర్మన్ వేణు, నాయకులు

నస్పూర్: ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావుపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కౌన్సిలర్ బేర సత్యనారాయణపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బేర సత్యనారాయణపై సోమవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సుగుణాకర్‌కి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యేపై ఎవరైనా అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పూదరి కుమార్, మద్రి రాజమౌళి, నాయకులు గెల్లు మల్లేశ్, ధర్ని మధూకర్, విజయ్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


పరిసరాలను పరిశీలిస్తున్న డాక్టర్ అనిత

నస్పూర్: పట్టణ ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ప్రోగ్రామింగ్ అధికారిణి డాక్టర్ అనిత తెలిపారు. పట్టణ పరిధిలోని ప్రొఫెసర్ జయశంకర్ కాలనీలో ఇటీవల ఓ వ్యక్తికి డెంగీ పాజిటివ్ నిర్ధారణ కాగా, మెడికల్ సిబ్బందితో కలిసి అనిత సోమవారం రోగి ఇంటిని, పరిసరాలను పరిశీలించారు. దోమలు వృద్ధి చెందకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఎల్‌ఐసీ కాలనీ, పద్మశాలీ కాలనీలో ప్రాంతంలో మంగళవారం ఉదయం 10గంటల నుంచి 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏడీఈ వేణుగోపాల్, ఏఈ సంధ్యారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ మరమ్మతులు, చెట్టుకొమ్మల తొలగింపు కారణంగా విద్యుత్ సరఫరా తొలగించనున్నట్లు వినియోగదారులు సహకరించాలని కోరారు.


దండేపల్లి: కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

గోపాల.. గోపాల

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు | ఉట్టికొట్టి సందడి చేసిన యువకులు

కృష్ణుడు, గోపిక వేషధారణలో అలరించిన చిన్నారులు

భీమారం/చెన్నూర్‌రూరల్/లక్సెట్టిపేట/మంచిర్యాలక్రైం/దండేపల్లి/శ్రీరాంపూర్/కోటపల్లి/భీమిని/బెల్లంపల్లి/బెల్లంపల్లిరూరల్/తాండూర్/నస్పూర్/పాతమంచిర్యాల/వేమనపల్లి: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు జిల్లా వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక పూజలు నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలతో అందంగా ముస్తాబు చేశారు. ఒకవైపు కీర్తనలు, మరోవైపు నృత్యాలు చేస్తుంటే గ్రామాల్లో యువకులు ఉట్టికొట్టే కార్యక్రమాలు నిర్వహించారు. పలు పాఠశాలల్లో వేడుకలు నిర్వహించగా సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బెల్లంపల్లి మండలంలోని కన్నాల శివారు శ్రీ బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.బుధాకుర్దులోని పబ్బతి అంజనేయస్వామి, తాండూర్ మండలం బోయపల్లి అభయాంజనేయ స్వామి ఆలయాల్లో ఎక్కాహం నిర్వహించారు. భీమారంలో యాదవులు శ్రీకృష్ణుని చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.


బెల్లంపల్లి: ఉట్టికొడుతున్న చిన్నారులు


పాతమంచిర్యాల: వేషధారణలో విద్యార్థులు


మంచిర్యాలక్రైం: ఏసీసీ అంగన్‌వాడీ సెంటర్లో..


వేమనపల్లి: అభిషేకం, అన్నపూజలో భక్తులు


శ్రీ బుగ్గ రాజేశ్వర స్వామి ఆలయంలో పూజలు


కృష్ణుడి వేషధారణలో బాలిక


బోయపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో ఎక్కాహంలో పాల్గొన్న భక్తులు


అంగ్రాజ్‌పల్లిలోని వివేకానంద పాఠశాలలో కృష్ణుడు, గోపికల వేషధారణలో విద్యార్థులు

సమస్యల పరిష్కారానికి కృషి

- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

నస్పూర్: పట్టణంలోని సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు తెలిపారు. పట్టణ పరిధిలోని 12వ వార్డులో ఎమ్మెల్యే సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులోని సమస్యలను ప్రజలను అడిగి తెలిసుకున్నారు. పలు సమస్యలను వార్డు ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వార్డులోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో చైర్మన్ సురిమిల్ల వేణు, కౌన్సిలర్ బొద్దున సంధ్యారాణి, పలువురు కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

సంక్షిప్త వార్తలు

తాగునీరు సరఫరా చేయాలి

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కార్మిక కాలనీల్లో సరిపడా తాగునీరు సరఫరా చేయాలని టీబీజీకేఎస్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. తాగునీటి సరఫరా విషయంలో అధికారులను అడిగితే గోదావరి నుంచి సరిపడా నీరు రావడం లేదని సమాధానం ఇస్తున్నారని ఆరోపించారు.

బాల్యమిత్రుడికి భరోసాగా..

దండేపల్లి: మండలంలోని చెల్కగూడెంకు చెందిన రఘుపతి, విద్యుత్ ప్రమాదానికి గురికావడంతో వైద్య ఖర్చులకు సుమారు రూ.20లక్షల వరకు ఖర్చయ్యాయి. అతడితో మండలంలోని రెబ్బనపల్లి ఉన్నత పాఠశాలలో చదివిన 1998–99ఎస్సెస్సీ బ్యాచ్ మిత్రులు అతడికి కొంత భరోసాగా నిలిచారు. తమవంతుగా రూ.35వేలు పోగు చేసి, సోమవారం రఘుపతికి అందించారు. కార్యక్రమంలో బాల్య మిత్రుడు కొటాల సీఐ ముత్యం రమేష్, మిత్రులు పాల్గొన్నారు.

సన్మానం

జన్నారం: ఈ నెల 27న జన్నారం మండల కేంద్రంలోని ఆర్‌ఆర్‌ఎస్ ఫంక్షన్ హాల్లో ఉద్యోగ విరమణ పొందిన అధికారులకు ఇటీవల పదవీ కాలం ముగించుకున్న ప్రజాప్రతినిధులకు మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంఘం మండల అధ్యక్షుడు కాసెట్టి లక్ష్మణ్ తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

భీమిని: వీవోఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కన్నెపల్లి వీవోఏ(విలేజ్), మండల అధ్యక్షుడు గంధం దాసు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడారు. ఐకేపీ వీవోఏలుగా 22సంవత్సరాల నుంచి విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ, ప్రభుత్వం గుర్తించడం లేదన్నారు. వెంటనే ప్రభుత్వం గుర్తించి రూ.26వేలు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.

చేతి పంపు ప్రారంభం

దండేపల్లి: మండలంలోని నర్సాపూర్ ఎస్సీ కాలనీలో లిట్రసీ ఇండియా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేతిపంపును సోమవారం ప్రారంభించారు.

రేపు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం రాపల్లి పునరావాస కాలనీలో 28వ తేదీ బుధవారం శ్రీఅభయాంజనేయ శివపంచాయతన సహిత నవగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ప్రారంభమైంది.

మదర్ థెరిస్సా సేవలు మరువలేనివి

పాతమంచిర్యాల: మదర్‌థెరిస్సా జయంతిని జిల్లా కేంద్రంలోని ఆనంద నిలయం లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. మదర్ థెరిస్సాకు ఘనంగా నివాళులర్పించారు.

కన్నీటి వ్యథ..!

- రైల్వే రడగంబాల బస్తీలో నీట మునిగిన ఇళ్లు
- తడిసిన బియ్యం, ఇతర వస్తువులు
- కట్టుబట్టలతో ఫంక్షన్‌హాల్‌లో బస చేసిన నిరాశ్రయులు


వరద నీటితో తడిసిన బట్టలు, మంచాన్ని ఎండలో ఆరబెట్టిన వరద బాధితులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి రైల్వేస్టేషన్ ప్రాంతంలో వరద ప్రవాహం ఇళ్లలోకి వెళ్లడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆదివారం కురిసిన భారీ వర్షానికి తోడు, రైల్వేకాలనీ ప్రాంతంలో వరద నీరు బయటకు వెళ్లిపోకుండా వేసిన అడ్డుకట్టను తెంచడంతో ఒక్కసారిగా నీటి ఉధృతి పెరిగి దిగువ ప్రాంతంలో ఉన్న ఇళ్లు, రైల్వే క్వార్టర్లు పదుల సంఖ్యలో నీట మునిగిన సంగతి తెలిసిందే. రైల్వే రడగంబాల బస్తీలో ఉన్న చెరువు నీరు, ఎగువ ప్రాంతం నుంచి తన్నుకు వచ్చిన వరదతో లోతట్టు ప్రాంతంలో ఉన్న సాధారణ ప్రజల ఇళ్లు నీట మునిగి తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఏడు కుటుంబాలకు తీవ్ర నష్టం కలిగింది. ఇళ్లలో ఉన్న బియ్యం, నిత్యావసర వస్తువులు నీటిలో తడిసిపోయి ఎందుకు పనికి రాకుండా పోయాయి. వంట పాత్రలు, ఇతర వస్తువులు నీటి ప్రవాహంలో కొట్టుకుపోగా మంచాలు, దుస్తులు తడిసి ముద్దయ్యాయి. ఒండ్రు మట్టి, ఇసుక కొట్టుకు వచ్చి ఇళ్లలో పేరుకుపోవడంతో బాధితులు నిద్రలేని రాత్రిని గడిపారు. 12వార్డు కౌన్సిలర్ మానవతా దృక్పథంతో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో బస, భోజన సౌకర్యం కల్పించడంతో కొందరు అక్కడికి వెళ్లి తలదాచుకోగా, ఇంకొందరు నీరు చేరి ఉన్న ఇళ్లలోనే చిమ్మచీకటిలో ఆశ్రయం పొందారు. జ్వరం వచ్చి మంచం పట్టిన ఓ కుటుంబం దిక్కులేని పరిస్థితులను చవి చూసింది. తాగడానికి మంచినీరు లేక, వంట వండుకోవడానికి వీలు లేక కన్నీటి వ్యధను అనుభవించారు. రైల్వే కాలనీలో నివాసం ఉన్న కుటుంబాలు అవస్థలు పడుతూ ఆ క్వార్టర్స్‌లోనే ఉండి పోయారు.

సహాయక చర్యలు చేపట్టని అధికారులు..

భారీ వర్షం, వరద నీటి ప్రవాహంతో నిరాశ్రయులైన ప్రజలకు సహాయ చర్యలు అందించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారనే విమర్శలు ఉన్నాయి. ఇళ్లలోకి భారీగా వరద నీరు వచ్చి చేరిన నేపథ్యంలో ఆ రాత్రి వంట చేసుకోలేని పరిస్థితులు ఉండగా, కనీసం తాగునీటి సౌకర్యం కూడా కల్పించలేదనే ఆరోపణలు వచ్చాయి. ప్రభుత్వ అధికారులు అటువైపు తొంగి చూడకపోవడంతో సహాయక చర్యలు కరువై బాధిత ప్రజలు నరకప్రాయంగా గడిపారు. కాగా సోమవారం ఉదయం వరదతో అతలాకుతలమైన బాధిత కుటుంబాలకు మున్సిపాలిటీ పరంగా నీటి ట్యాంకర్‌ను తెప్పించారు. ఆ నీటితో ఇంటిలోపల, పరిసరాల్లో పేరుకుపోయి ఉన్న మట్టి, ఇసుకను తొలగించేశారు. మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది పరిసరాలను శుభ్రంగా నీటితో కడిగి ఫినాయిల్ చల్లారు.

బియ్యం తడిసినయ్...



ఆకస్మికంగా వచ్చిన వరద నీరు మమ్మల్నీ తీవ్రంగా నష్ట పరిచింది. ఇంట్లో ఉన్న రెండు క్వింటాళ్ల బియ్యం, ఆహార వస్తువులు, బట్టలు తడిసిపోయాయి. మోకాటి బంటి లోతులో నీరు నిలిచి ఉండటంతో కట్టుబట్టలతో ఫంక్షన్‌హాల్‌లో బస చేసినం. వరద నీరు మమ్మల్నీ అన్ని రకాల నష్టాల పాల్జేసింది. ఇంతటి దుస్థితిని ఇప్పటి వరకు మేము ఎన్నడు చవి చూడలేదు. నిరుపేదలమైన మమ్మల్నీ ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలి.

– మల్లేష్, వరద బాధితుడు

గిట్ల జరుగుతదని అనుకోలే



ఇళ్లలో వరద నీరు వచ్చి చేరే వరకు మాకేం తెల్వదు. అంతా కొద్ది నిమిషాల్లోనే జరిగింది. మేమంతా ఇంట్లోనే ఉన్నం. మా ఇంట్లో ఒకరిద్దరికి జ్వరం వస్తోంది. భారీ వర్షానికి తోడు రైల్వే కాంట్రాక్టర్ మట్టికట్టకు గండి కొట్టించడంతో వరద నీరు దిగువ ప్రాంతంలో ఉన్న మా ఇళ్లను ముంచెత్తింది. ప్రాణాలతో మేమంతా బయట పడ్డాం. గిట్ల జరుగుతదని ఎన్నడు అనుకోలేదు. మా కష్టాలకు కారణమైన రైల్వే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని మాకు న్యాయం చేయాలే.

– ఓదమ్మ, వరద బాధితురాలు

చెత్త తొలగించారు..


పిచ్చి మొక్కలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం సక్రమంగా నిర్వహించలేదని 'స్వచ్ఛదనం లేదు.. పచ్చదనం కానరాదు' అనే శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. ఎక్కడైతే చెత్త పేరుకుపోయి ఉందో వాటిని తొలగించడంతో పాటు బైపాస్ రోడ్డులోని డివైడర్ మధ్యలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. హమాలివాడ రోడ్డుపై పారుతున్న డ్రెయినేజీ నీటిలో పేరుకుపోయిన చెత్తచెదారాన్ని సైతం తొలగించారు.


చెత్త తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది